# 'నేను చెయిర్మేన్ అయ్యాక గాంధిటోపీకూడా పెడుతున్నా....'

* కోలా బాబూరావు *

సాయంత్రం అయిదయింది. అఫీసునుంచి యింటికొస్తున్నా. వెనకాలెవరో బాబయ్యా అని పిలిచినట్లనిపించింది. నన్నేమోనని వెనక్కి తిరిగిచూచా. ఎవరో ఒక అపరిచిత వ్యక్తి. వేషం వగైరా దిట్టంగానే ఉన్నాయ్. నన్ను సమీపించి 'ప్రకాశరావుగారంటే మీరుకదూ' అని అడిగాడు. అవునని తల వూపా. 'మీరీమధ్యనీఊళ్లో చాలామందిని యింటర్ జేసి పేపర్లలో వేయించారటగాదాండి. నన్నూ అట్లాజేసి పేపరులో వేయిస్తే మీకు చాలా పుణ్యముంటుంది. మీ మేలెప్పటికీ మరువను అని' యింకా ఏమిటేమిటో నాకర్థంగాని కొన్నిసీ, అర్థమయ్యేవి కొన్నిసీ మాట్లాడుతూ ప్రాధేయపడ్డాడు. అసలు మీ రెవరో, మీదేవూరో శెలవిచ్చారు గాదని నేనన్నా—

"నేనాండి, ఈవూరి మునిసిపల్ చైర్మన్ నండి. మొన్న జరిగిన ఎలక్షన్‌లలో నెగ్గేనండి. నేను-చైర్‌మెన్ నన్నసంగతి మీకు తెలియక పోవడం చాలా ఆశ్చర్యంగా ఉందే."

"నేనూ యీ వూరొచ్చి యెన్నాళ్లో కాలేదండీ. అయినా యిటువంటి విషయాలు తెలియక పోవడమే నాకెంతో హాయిగా ఉంటుంది. సరేగానీ, మీరింతసేపటినుంచి యింటర్, యింటరంటూన్నారే, అదేమిటో నాకు బోధపడలేదండీ!"

"ఆ, అదేనండీ, ఏవేవో ప్రశ్నలడిగి వాటికి సమాధానాలు వగైరా పేపర్లో వేయిస్తారే, అదేనండీ."

"ఓహో, అదా, యింటర్‌వ్యూ అంటారు. అదిగదూ."

"ఆ, అద్దదేనండి రేపుదయం మా యింటి వద్ద—మీకు శ్రమ యిచ్చేననుకోక- మా యిల్లేండీ- ఈ తిన్నగా వెళ్ళితే కొబ్బరి చెట్లలో—గేటు—ముందఱ మ్యునిసిపల్ లాంతరుస్తంభం—అదేనండీ—వుదయం 8 గంటలకు వస్తే— మీరు కాఫీఫలహారా లక్కడే తీసుకుందురుగాని— తప్పక రావాలి–మీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. నా సరదా తీర్చాలి."

మొదట్లో, ఈ మహానుభావుణ్ణి యింటర్‌వ్యూ చేయడాన్కి ఈయనలో ఏం విశేషముందని సంకోచపడ్డా. కానీమధ్య సరియైన ప్లాటు దొరకక్క పత్రికలకేమీ ఆర్టికిల్స్ పంపడమే మానుకొన్నా- ఈ యింటర్‌వ్యూ పర్యవసానంగానయినా ఏదో టుమ్రీ అల్లవచ్చు ననుకొని సరేనన్నా. చైర్‌మెన్‌గారు మొఖం చేటంత చేసుకొని వెళ్ళేరు.

★

మరునాడుదయం - చైర్‌మెన్‌గారింట్లో యిద్దరం చెరోకుర్చీమీద కూర్చున్నాం. కాఫీఫలహారానంతరం సిగరెట్టు ముట్టించి—

"ఏమండీ యింకుపక్రమిద్దామా"

"మీ దయ"

"ముందుగా మీతో ఒక మాట చెప్పదల్చుకొన్నాను. అదేమిటంటే, నే నడిగిన ప్రశ్నలకు మీరు నిజం దాయకుండా ఉన్నదున్నట్లుగా చెబితేనే ఈ యింటర్‌వ్యూ విశేషాలు పేపర్లో పడ్డాన్కి అవకాశముంటుంది."

"నా సచ్ఛప్రమాణకంగా ఉన్నదున్నట్లే చెబుతానండీ."

"ఆ, అలాగయితే చెప్పండీ, వోటంటే మీ ఉద్దేశమేమిటి?"

"హిహిహిహి — యింత చిన్నప్రశ్నే పేరేమిటి–వోటంటే ఓ కాగితంముక్క."

"నాక్కావలసిం దదిగాదు, వోటంటే దాని విలువేమిటో అది ఎట్లా ఎవర్కి ఎప్పుడు ఏ రూపేన ఉపయోగ పడుతుందో మొదలగు వివరాలన్నీ ఒక్క ముక్కలో మీరు నిజం దాచకుండా చెప్పాలి.

"అబ్బా, చాలాలోతుగా అడిగేరే." కొంచెం సేపాలోచించి "వోటండీ, వోటరుకు బ్రతుకు తెరువండి."

"మీ ఆశయాలేమిటో చెప్పండీ?"

"ఆశయాలంటే?"

"ఉద్దేశాలు, కోరికలు వగైరా—"

"అవాండి, ఎలక్షన్‌లో ఖర్చయిన పదివేల రూపాయలూ ఈ చైర్‌మెన్‌గిరీలో రాబట్టు కోవడమూ, అధమం రెండుమేడలూ, యింటిలో ఒకపైపు, యింటి ముందర ఒక పైపూను."

"మీ రిటువంటి స్వార్థపు అంటే మీ సుఖా నికే చూచుకుంటూ, ప్రజల నోట్లో మట్టి కొడ్తూ ఉంటే యింక దేశంలో శాంతెక్కడిది, ప్రజ లకు సుఖమెక్కడిదీ మీరేమైనా ఆలోచించారా?"

"అదేమిటండీ, మీరూ అలాగే మాట్లాడ తారు. దేశానికి గొప్పసేవ జేసేస్తామని ప్రజ లని నమ్మించి ప్రజిచ్చిన వోట్లతో (కొన్నవి మినహాయించి) యిప్పుడు గద్దెక్కి వేనకివేలు జీతాలు మింగుతూన్న మహానుభావులదగ్గర నుంచి, తాలూకాఆఫీసుజవానువరకూ లంచాల కోసం చెయ్యి జాపుతూవుంటే ఏమీ జీతం, భత్యం లేని నాబోటివాడిమాత్రందానికి కక్కుర్తి పడితే యిదో గొప్పనేరమాండి."

"ఆ, యిదేమంత గొప్పనేరం లేండి. ఏదో మాటవరుస కడిగే నంతే."

"ఆ, చూచారా, చదువుకొన్నవారు గాబట్టి వెంటనే గ్రహించకల్గారు."

యింక తర్వాత యేమడగాలో వెంటనే తట్ట లేదు. సాధారణంగా ఆ వ్యక్తికున్నలవాట్లు, ఏయే సినీమాతారలంటే యిష్టమోవగైరా ప్రశ్నలు వేస్తేనేగాని యింటర్‌వ్యూ అనిపించుకోదని—

"తరచు మీరే యే పుస్తకాలు చదువు తూంటారు."

"పెద్దబాలశిక్ష, ఎక్కాల బొక్కున్నా. ఈ మధ్య కొవ్వలి నవలలు మా పెద్దోడు సదువు తూంటే యింటున్నా."

"మీకే యాటంటే యిష్టం?"

"మా యయ్య బ్రతికున్నప్పుడు గోళీకాయ లాటంటే మహసర్దాగుండేది. మా అయ్య పోయింతర్వాత పేకాటంటే అందులోనూ, గాడి దాటంటే పడిసచ్చిపోతా."

"మీ కిష్టమైన పానీయమేదండీ?"

"పానీయమంటే?"

"టీ, కాఫీ వగైరా, వగైరా."

"సారా, సోడా—యివిగూడా పానీయాలే గదండీ."

"ఓ"

"అలాగయితే, ఆ రెండూ కలిపింది నాకు మజాగా ఉంటదండీ."

"మీ కేయే బట్టలంటే యిష్టం?"

"కాంగ్రెసోళ్లు జైళ్ళలోకి వెళ్ళేరోజులలో గోగ్రెమార్కు పాపిలైను, అరవయ్యో నెంబరు పంచెలూన్ను. కాంగ్రెసోళ్ళు పవర్‌లో కొచ్చిన తర్వాత ఖద్దరుబట్టలు, నేను చైర్‌మెన్ అయ్యాక గాంధీటోపీనూడా పెడుతున్నా."

యిది యింటర్‌వ్యూయొక్క భోగట్టాలు, ఏ పత్రికాధిపతైనా ఆయన పేపరులో ఒక్కపేజీ పుణ్యంగట్టుకుంటే నాకు మాటా దక్కుతుంది. చైర్‌మెన్‌గారి సరదాయున్ను తీరుతుంది.

కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁ జేయు నల్లఁదనమునందు,
పరుగు తరుగు లేని పొంకుఁదలను,
ఎదకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు
పొదలు కృష్ణవేణి నదిని బోలి.

మద్రాసు, దక్షిణజిల్లాలకు డిస్ట్రిబ్యూటరు:
సి. ఆర్. తిరుమల్‌పాడ్,
141, గోవిందప్పనాయకన్‌వీధి, మద్రాసు 1.